క్లుప్తంగా

## ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు



అవార్డు అందుకున్న అమర్‌సింగ్

**టేకులపల్లి:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని టేకులపల్లి మండలంలో పని చేస్తున్న ఆరుగురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, భద్రాచలంలో ఐటీడీఏ పీఓ రాహుల్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజిక్స్ టీచర్ ఎం.మోహన్‌రావు, కోయగూడెం ఆశ్రమ పాఠశాల తెలుగు టీచర్ బి.అమర్‌సింగ్, కేజీబీవీ కేటగిరీలో టేకులపల్లి కేజీబీవీ ఎస్‌ఓ బి.సంతు, ఎస్‌జీటీ కేటగిరీలో ఎంపీపీఎస్ వాగొడ్డుతండా టీచర్ బానోతు లక్ష్మా, ఎంపీపీఎస్ తుమ్మలచెలక టీచర్ బి.పూల్‌సింగ్, ఎంపీపీఎస్ రోళ్లపాడు టీచర్ కె.మంగీలాల్ అవార్డులు స్వీకరించారు. వీరిని మండల విద్యాశాఖాధికారి అజ్మీర్ జగన్ నాయక్ అభినందించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



మాచినేనిపేటతండాలో శంకుస్థాపనలో పాల్గొన్న నాయకులు

**జూలూరుపాడు:** మాచినేనిపేటతండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో లకావత్ రమేష్, గొల్లి వెంకటేశ్వర్లు, మెంతుల కృష్ణ, భూక్యా అనిల్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఆర్‌సీహెచ్‌పీని సందర్శించిన డైరెక్టర్

**కొత్తగూడెంఅర్బన్:** కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీహెచ్‌పీని శుక్రవారం డైరెక్టర్ (ప్లానింగ్ – ప్రాజెక్ట్స్) కొప్పుల వెంకటేశ్వర్లు సందర్శించారు. ఆర్‌సీహెచ్‌పీ నుంచి రైలు మార్గం ద్వారా బొగ్గు రవాణా గురించి ఎస్ఈ (ఈఅండ్ఎం) షైక్ కరీముల్లాను అడిగి తెలుసుకున్నారు. అతి త్వరలో ప్రారంభించబోయే వీకే కోల్‌మైన్ కోల్ డిస్పాచ్ ఏర్పాట్లు, ప్రస్తుత స్థితిని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా అధికారులు పాల్గొన్నారు.

## తైక్వాండోతో ఆత్మరక్షణ



వేడుకలో పాల్గొన్న సీఐలు, క్రీడాకారులు

**కొత్తగూడెంటౌన్:** కొత్తగూడెం సీఈఆర్ క్లబ్‌లో తైక్వాండో డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ చెన్నూరి శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ నరేష్ హాజరయ్యారు. తైక్వాండో క్రీడలు ఆరోగ్యానికి ఆత్మరక్షణకు ఉపయోగపడతాయని చెప్పారు. విద్యతో పాటు బాలబాలికలు తైక్వాండో నేర్చుకంటే మానసిక ధైర్యం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎండీ మక్బుల్, వైస్ ప్రెసిడెంట్ ఎండీ షమీయుద్దీన్, జనరల్ సెక్రటరీ ఎల్.రమేష్‌కుమార్, ఎస్కే యాకుబ్ పాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికిరణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# నేడు నిమజ్జనం

- ప్రకాశం స్టేడియం నుంచి గణేష్ శోభాయాత్ర
- రాత్రి సమయంలో భారీ వాహనాలకు నో ఎంట్రీ..



సూపర్‌బజార్‌లో శోభాయాత్ర సభా వేదిక

**కొత్తగూడెంటౌన్:** నవరాత్రులు పూజలందుకున్న గణనాథుడి విగ్రహాలను శనివారం నిమజ్జనం చేయనున్నారు. పోలీసుశాఖ, విశ్వహిందూ పరిషత్ సభ్యులతో పాటు ఇతర శాఖల అధికారులు శోభాయాత్ర నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొత్తగూడెంలోని వివిధ ప్రాంతాలతో పాటు జూలూరుపాడు, సుజాతనగర్‌లో ప్రతిష్ఠించిన దాదాపు 400 పైగా విగ్రహాలతో ఊరేగింపుగా శనివారం సాయంత్రం 5 గంటల తరువాత కొత్తగూడెం ప్రకాశం స్టేడియం చేరుకుని అక్కడ పూజల అనంతరం భద్రాచలం బయలుదేరనున్నారు. ట్రాఫిక్ పోలీసులతో పాటు ఐదుగురు సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లతో బందోబస్తు చేపట్టనున్నట్లు డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ శుక్రవారం తెలిపారు.

**గూడెంలో ట్రాఫిక్ ఆంక్షలు...**

కొత్తగూడెం సింగరేణి ప్రకాశం స్టేడియానికి చేరుకున్నాక, సూపర్‌బజార్, ఓల్డ్ బస్టాండ్, లక్ష్మీదేవిపల్లి, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా పాల్వంచ మార్గంలో విగ్రహాలను భద్రాచలం తీసుకెళ్తారు. ఈ మేరకు కొత్తగూడెంలో భారీ వాహనాల రాకపోకలను శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు అనుమతి ఉండదని డీఎస్పీ చెప్పారు. ఇల్లెందు, భద్రాచలం నుంచి వచ్చే వాహనాలు పాలకేంద్రం నుంచి పాత కొత్తగూడెం, సింగరేణి ఆస్పత్రి మీదుగా హెడ్డాఫీస్‌కు, విజయవాడ, రుద్రంపూర్ ఏరియాల నుంచి వచ్చే వాహనాలు ఇల్లెందుకు, భద్రాచలంకు వెళ్లాంటే పోస్టాఫీస్ ఏరియా హేమాచంద్రపురం మీదుగా, భద్రాచలం వెళ్లాంటే హెడ్డాఫీస్ నుంచి పాత కొత్తగూడెం మీదుగా పాల్వంచకు వెళ్లాల్సి ఉంటుందని వెల్లడించారు.

**వైభవంగా శ్రీ లక్ష్మీగణపతి కల్యాణం**

**జూలూరుపాడు:** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జూలూరుపాడు శ్రీసీతారామాలయంలో గురువారం రాత్రి శ్రీ లక్ష్మీగణపతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం గణేష్ లడ్డూ వేలం పాట పోటాపోటీగా సాగింది. స్థానికుడు సిరిపురపు శ్రీనివాసరావు అనే భక్తుడు 33 కిలోల గణేష్ లడ్డూను రూ.21,500లకు దక్కించుకున్నారు. పలు చోట్ల అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. గణేష్ విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళ్లగా, శనివారం కూడా పలు గ్రామాల్లో గణనాథులను ఊరేగింపు నిర్వహించి, అనంతరం నిమజ్జనం చేయనున్నారు.

**మండపాల్లో ప్రత్యేక పూజలు**

**ఇల్లెందు:** గణేష్ నవరాత్రుల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని మండపాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. పలు మండపాల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి కోరం లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు దిండిగల రాజేందర్ ప్రత్యేక పూజలు చేసి అన్నదానాల్లో పాల్గొన్నారు.

**టేకులపల్లి:** వినాయక చవితి వేడుకల్లో భాగంగా టేకులపల్లి మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో పూజా కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం టేకులపల్లి సెంటర్‌లో పజారి శ్రీరంగం అజయ్ సాయి చక్రి, కుప్పుస్వామి కాలనీలో పూజారి మంతోజు పవన్‌కుమారాచార్యుల ఆధ్వర్యంలో హోమం పూజలు చేశారు. బస్టాండ్ సెంటర్‌లో కుంకుమ పూజ చేశారు.



జూలూరుపాడు శ్రీసీతారామాలయంలో శ్రీ లక్ష్మీ గణపతి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

**ఏర్పాట్లు పూర్తి చేశాం..**



ప్రశాంత వాతావరణంలో శోభాయాత్ర జరిగేలా భక్తులు సహకరించాలి. కొత్తగూడెంలోని అన్ని ప్రాంతాల వినాయక విగ్రహాలను భద్రాచలం నిమజ్జనానికి తరలించడానికి ఏర్పాట్లు పూర్తి చేశాం.

**– లక్ష్మణ్, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కొత్తగూడెం**

**ఆనందంగా జరుపుకోవాలి..**



విగ్రహాలకు స్వాగతం పలకడానికి వేదికలు ఏర్పాటు చేశాం. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ వాహనాలకు ప్రవేశం ఉండదు. శోభాయాత్ర, నిమజ్జనాన్ని ఆనందంగా జరుపుకోవాలి.

**– అబ్దుల్ రెహమాన్, కొత్తగూడెం డీఎస్పీ**



పాల్వంచరూరల్: పాతసూరారం విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



ఇల్లెందు: కళాసీ బస్తీలో...



టేకులపల్లి బస్టాండ్ సెంటర్‌లో కుంకుమ పూజ

# గంగమ్మ చెంతకు గణపయ్య

**ఇల్లెందురూరల్:** నవరాత్రులు వినాయకుడికి విశేష పూజలు చేసిన భక్తులు అంతే భక్తిశ్రద్ధలతో శుక్రవారం గంగమ్మ ఒడికి చేర్చారు. మండలంలోని పలు గ్రామాలలో గణేష్ నిమజ్జనోత్సవ శోభాయాత్ర కనుల పండువగా సాగింది. మేళ తాళాలతో సాంప్రదాయ నృత్యాలు చేస్తూ విగ్రహాలను గ్రామ పొలిమేరలు దాటించారు. అంతకు ముందు స్వామివారి చేతిలో ఉన్న లడ్డు, కలశం, వస్త్రాలకు వేలంపాట నిర్వహించారు. సుభాష్‌నగర్‌లో లడ్డూను రూ.1,21,116లకు శ్రీరామచంద్ర గ్రూప్, లచ్చగూడెం గ్రామంలో రూ.38,616లకు రంగినేని సంజీవరెడ్డి సొంతం చేసుకున్నారు.

**పాల్వంచరూరల్:** తొమ్మిది రోజులు ఘనంగా పూజలందుకున్న వినాయక విగ్రహాలను నిర్వాహకులు, భక్తులు ప్రత్యేక వాహనాల్లో గణేష్ విగ్రహాలను ఊరేగింపుగా భద్రాచలం వద్ద గోదావరి నదికి తరలించారు. మండలంలోని పాండురంగాపురం, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.



ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ గణపతి శోభాయాత్రలో భక్తులు



పాల్వంచరూరల్: పాండురంగాపురంలో నిమజ్జనానికి బయలుదేరిన విగ్రహం

# ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి



అధికారులతో మాట్లాడుతున్న వెంకన్న జాదవ్

**కొత్తగూడెంఅర్బన్:** సింగరేణి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) – చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.వెంకన్న జాదవ్ శుక్రవారం కొత్తగూడెంలోని సెంట్రల్ వర్క్‌షాప్, సింగరేణి ప్రధానాస్పత్రిని సందర్శించారు. నిర్వహణ విధానాలు, మెటీరియల్ మేనేజ్‌మెంట్, భద్రతా చర్యలు, కార్యకలాపాల అమలు పద్ధతులను పరిశీలించి, అధికారులు, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. సెంట్రల్ వర్క్‌షాప్‌లో తన పరిశీలనలో గమనించిన అంశాలను ప్రస్తావిస్తూ మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమయపూర్వక మెయింటెనెన్స్, సమర్థవంతమైన మానిటరింగ్, బాధ్యతాయుతమైన పనితీరుతో మాత్రమే నాణ్యతా ప్రమాణాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. అనంతరం సింగరేణి ప్రధానాస్పత్రిలోని సిటీ స్కాన్, క్యాజువాలిటీ వార్డులను సందర్శించి మెయిన్ ఆస్పత్రిలోని మెడికల్ పరికరాలు, మందులు, ఉద్యోగులకు అందించే వైద్య సదుపాయాల గురించి గురించి సీఎంఓ, డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీఎం (ఈ–ఎం) ఎన్.దామోదర్‌రావు, సీఎంఓ ఆర్.కిరణ్‌రాజ్ కుమార్, ఏజీఎం మెయిన్ వర్క్‌షాప్ రాజీవ్ కుమార్, ఏసీఎంఓ ఎం.ఉష, డీవై.సీఎంఓ సునీలా, ఎస్ఈ (ఈ–ఎం) జి.ఉమామహేశ్వర రావు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

# మహ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం



పాల్వంచలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

**పాల్వంచ:** మహ్మద్ ప్రవక్త మార్గం యావత్ ప్రపంచానికి అనుసరణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, జామ మజీద్ అధ్యక్ష, కార్యదర్శులు ఫయాజుల్ హుస్సేన్, ఇబ్రహీం ఖురేషి అన్నారు. శుక్రవారం మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా పాల్వంచ మర్కజీ జమా మజీద్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ ప్రవక్త సల్లెల్లాహు అలైహి వసల్లం గొప్పతనాన్ని వివరించారు. తల్లి పాదాల చెంత స్వర్గముందని, మానవ సేవే మాధవ సేవగా దారి చూపారన్నారు. ర్యాలీలో కొత్తగూడెం, రామవరం, చుంచుపల్లి, మణుగూరు, భద్రాచలం, అశ్వాపురం, బూర్గంపాడు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లింలు, మత గురువులు మీరా, ఖాజా మహ్మద్, జైనుల్లా ఆబిదీన్, అక్బర్, మస్తాన్ ఖురేషి, రహీం తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పాలు, పండ్లు అందించారు.

**కొత్తగూడెంఅర్బన్:** అంజుమన్ వెల్ఫేర్ సొసైటీ, ఐలే సున్నత్ వల్ జమాత్, రైల్వే మస్జిద్ కమిటీ కలిసి మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా శుక్రవారం కొత్తగూడెం జిల్లా ఏరియా ఆస్పత్రిలో, రామవరం మాతాశిశు ఆస్పత్రిలో పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రజాక్, అమీర్ ఖాద్రి, ఖాజా బాబా, కరీం ఖాద్రి, హుస్సేన్, యూసుఫ్, ఖమర్, బాబు జాని ఖాన్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న సాబీర్‌పాషా

# జీపీ కార్యాలయం ప్రారంభం



బొజ్జాయిగూడెం జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

**ఇల్లెందురూరల్:** గ్రామపంచాయతీ కార్యాలయాలు సమస్యల పరిష్కార వేదికలు కావాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గ్రామపంచాయతీలలో నూతనంగా నిర్మించిన కార్యాలయ భవనాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాలలో సీసీ రహదారులకు శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడం కోసం ప్రభుత్వం రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని చెప్పారు. రానున్న రోజుల్లో మరింత మందికి ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, ఎంపీఓ చిరంజీవి, పంచాయతీరాజ్ ఏఈ రాజు, నాయకులు పులి సైదులు, అరెం కిరణ్, మండల రాము, పూనెం సురేందర్, సాంబమూర్తి, సూర్యం, నాగార్జున్, తాటి రాంబాబు పాల్గొన్నారు.

## మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

**పాల్వంచరూరల్:** నూతన జీఎస్టీ సంస్కరణలో భాగంగా పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల కోసం జీఎస్టీ స్లాబ్‌లను తగ్గించినందుకు కృతజ్ఞతగా శుక్రవారం స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫ్లెక్సీకి బీజేపీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బుడగం రవికుమార్, పానిశెట్టి వెంకటేశ్వర్లు, వీరన్న, రాము, సీతారాంనాయక్, రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులను రక్షించాలి

**కొత్తగూడెంఅర్బన్:** ఎన్నో పోరాటాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న హక్కులను రక్షించుకుంటూ, నూతన హక్కులు సాధించుకుంటేనే యూనియన్ కొమరయ్యకు మనమిచ్చే ఘన నివాళి అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి, యూనియన్ వ్యవస్థాపక సభ్యుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మనుబోతుల కొమరయ్య 29వ వర్ధంతిని ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి ప్రధాన కార్యాలయం వద్ద కొమరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రుద్రంపూర్ ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేసిన కొమరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. తరువాత యూనియన్ కొత్తగూడెం బ్రాంచి కార్యాలయాన్ని ప్రారంభించారు. కూనంనేని మాట్లాడుతూ సింగరేణిలో ఎనిమిది గంటల పనివిధానాన్ని సాధించిన ఘనత కొమరయ్యదేనన్నారు. కార్యక్రమంలో ఎస్కే సాబీర్ పాషా, వాసిరెడ్డి సీతారామయ్య, కోరిమి రాజ్‌కుమార్, మిర్యాల రంగయ్య, జి.వీరస్వామి, వైవీ రావు, జి.వీరస్వామి, వంగ వెంకట్, వి.మల్లికార్జున్ పాల్గొన్నారు.



కొత్తగూడెంఅర్బన్: కొమరయ్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే, నాయకులు

**ఇల్లెందు:** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకుడు కొమరయ్య కార్మికవర్గ పక్షపాతి అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె.సారయ్య, బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ అన్నారు. కొమరయ్య 29వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పాత బస్టాండ్‌లోని కొమరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాసరి రాజారామ్, కె.వెంకటేశ్వర్లు, గడదాసు నాగేశ్వరరావు, సుందర్, శంకర్, బాస శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# చెట్లెక్కినా గుట్టలెక్కినా నో సెల్ సిగ్నల్

- నిరుపయోగంగా బీఎస్ఎన్ఎల్ టవర్
- ఇబ్బంది పడుతున్న మర్రిగూడెం ప్రజలు



సెల్ టవర్ వద్ద నిరసన తెలుపుతున్న మర్రిగూడెం గ్రామప్రజలు (ఫైల్)

**ఇల్లెందురూరల్:** ఇల్లెందు – గుండాల రహదారిలో దాదాపుగా మధ్య భాగంలో ఉండే గ్రామపంచాయతీ అది. ఇల్లెందు మండల కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఒకప్పుడు దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో టెలిఫోన్ సౌకర్యం వారి దరి చేరలేదు. ప్రపంచమంతా చేతిలో సెల్‌లో పట్టుకొని ప్రపంచ సమాచారాన్ని క్షణాల్లో తెలుసుకుంటుండగా మర్రిగూడెం ప్రజలకు మాత్రం అందని ద్రాక్షగా మిగిలిపోతోంది.

**నిర్వహణ కొరవడి తగ్గిన సిగ్నల్..**

నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో సెల్ సిగ్నల్ వ్యవస్థ విస్తరణకు బీఎస్ఎన్ఎల్ అధికారులకు ఆంక్షలు ఉండేవి. కానీ రహదారుల అభివృద్ధితో రవాణా సౌకర్యం మెరుగుపడటంతో బీఎస్ఎన్ఎల్ అధికారులు సైతం మండలంలోని కొమరారం, మర్రిగూడెం కేంద్రంగా సెల్‌టవర్లను ఏర్పాటు చేశారు. కొంతకాలం సౌకర్యవంతంగా ఉండటంతో ప్రజలు సైతం వినియోగించుకున్నారు. ఈ క్రమంలోనే గ్రామపంచాయతీలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించే లక్ష్యంతో కేబుల్ పరిచే పనులు చేపట్టినప్పటికీ పనులు తుది దశకు చేరుకుంటున్న సమయంలో బీఎస్ఎనల్ ప్రైవేటీకరణ జరగడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా సెల్‌టవర్ల నిర్వహణ సన్నగిల్లడంతో వాటి పనితీరు క్రమంగా తగ్గుతూ వచ్చింది. చివరకు కిలోమీటరు పరిధిలో అది కూడా అడపాదడపా మాత్రమే పనిచేస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు.

**కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా...**

నియోజకవర్గంలోని కొన్ని మారుమూల గ్రామాల పరిధిలో సెల్‌టవర్లు ఉన్నా సిగ్నల్ సక్రమంగా లేదని, దీనివల్ల అటు ప్రజలు, ఇటు ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ సంబంధిత కార్యక్రమాల ఆన్‌లైన్ పనులలో ఇబ్బంది పడుతున్నారని, జిల్లా స్థాయి సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు ఎమ్మెల్యే కోరం కనకయ్యను స్వయంగా కలిసి సెల్‌సిగ్నల్ సరిగా లేని గ్రామాల వివరాలు తెలుసుకున్నారు. పలు గ్రామాలను సందర్శించి పనితీరు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.

ఇది జరిగి దాదాపు నెలరోజులు దాటినా బీఎస్ఎన్ఎల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యకు పరిష్కారం చూపకపోవడంతో మండలంలోని మర్రిగూడెంతోపాటు పూబెల్లి గ్రామపంచాయతీ ప్రజలు సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

**ఇవి ప్రధాన సమస్యలు...**

ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రతీ గ్రామపంచాయతీలోనూ వేగవంతంగా సాగుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మూడు దశల్లో బిల్లులు మంజూరవుతాయి. తొలివిడతగా బేస్‌మెంట్ స్థాయిలో ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ సెల్ సిగ్నల్ సరిగా లేకపోవడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో సెల్ సిగ్నల్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో క్షేత్రస్థాయి నుంచి తక్షణ సమాచార సేకరణలోనూ అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వ సంబంధిత కార్యక్రమాల నిర్వహణ కోసం గ్రామపంచాయతీ పరిధిలో నేటికీ టాంటాం తప్ప మరోమార్గం లేకుండా పోయింది.

**గుట్టలు ఎక్కితే కానీ..**



గ్రామంలో సెల్‌టవర్ ఉన్నప్పటికీ సిగ్నల్ సరిగా ఉండటం లేదు. కొన్ని సందర్భాలలో చెట్టు లేదా సమీపంలోని గుట్టలు ఎక్కితే కానీ సిగ్నల్ అందదు. సిగ్నల్ ఎక్కడ ఉంటుందో చూసుకొని అక్కడే సెల్‌ను వేలాడదీయాల్సి వస్తోంది.

**– చింత రజిత, మాజీ సర్పంచ్, మర్రిగూడెం**

**వ్యవస్థను మెరుగుపర్చాలి..**



సెల్‌టవర్ గ్రామంలో ఏర్పాటు చేసినా ఎటువంటి ఉపయోగం లేదు. ఎక్కడ సిగ్నల్ ఉంటుందో వెతుక్కోవాల్సి వస్తోంది. టవర్‌కు సమీపంలో మాత్రమే అప్పుడప్పుడు సిగ్నల్ అందుతోంది. అధికారులు స్పందించి సిగ్నల్ వ్యవస్థను మెరుగుపర్చాలి.

**– కుంజ ప్రభాకర్, మర్రిగూడెం**

# సర్వేపల్లి జీవితం నేటి తరానికి ఆదర్శం

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం నేటి తరానికి ఆదర్శంగా నిలవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సర్వేపల్లి జయంతి పురస్కరించుకొని శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను స్థానికులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు శాలువాలు కప్పి సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ మాట్లాడుతూ అధ్యాపక వృత్తి నుంచి మొదలైన ఆయన ప్రస్థానం ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ఎదిగే వరకు సాగిందని, భారతదేశ రాజకీయాల్లో ఆయన చెరగని ముద్ర వేసుకున్నారని, అలాంటి విద్యా కోవిదుడి జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. సమయస్ఫూర్తి, వాక్చాతుర్యం, అత్యుత్తమ బోధన గల సర్వేపల్లి జీవితం నేటి తరానికి దిక్సూచి కావాలని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉద్యోగులు



కొత్తగూడెంటౌన్: రామవరం అంగన్‌వాడీలో టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం



జూలూరుపాడు: పడమటనర్సాపురం ఏజీహెచ్ఎస్‌లో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న టీచర్లు